# నవీనత

— ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

మధ్యాహ్నం తీరికగా వున్నది సుధ. కాలక్షేపానికి ఏవో పుస్తకాలు తిరగేసింది. అయిదు నిముషాలకే విసుగ న్పించింది.

'అబ్బ, ఏమున్నాయి ఈ పుస్తకాలలో? అంతా ఒకే మూసధోరణీ, మూఢ నమ్మకాల విస్తరణ'

అనుకుంటూ పుస్తకాలు తిరిగి టేబుల్ మీద పడవేసింది.

ఇల్లంతా కలదిరిగింది ఏమైనా చెయ్యాలని. కానీ ఇంటిపనీ, వంటపని దేనిమీదా మనస్సు నిలువలేదు. డ్రాయింగ్ రూంలోకి వచ్చి ఫోన్ చేతికి తీసుకుంది. స్నేహితులొక్కక్కరికే ఫోన్ చేయడం ప్రారంభించింది.

"హల్లో, వీణా, హమ్మయ్య. నువ్వైనా ఇంటి దగ్గర దొరికావు తల్లీ. ఇప్పటికి నలుగురు ఇళ్ళకి ఫోన్ చేశాను. మహా తల్లులు ఒక్కరూ ఇంటి దగ్గర లేరట."

వీణా నుతారంగా నవ్వడం విన్పించింది.

"ఎలా దొరుకుతారు చెప్పు? ఏవో వ్యాపకాలు వుంటాయి కదా?"

"నువ్వు ఎలా వున్నావ్?"

"బాగానే వున్నాను ఈ రోజు సెలవుపెట్టానులే."

"అయితే వీణా, మాయింటికి వచ్చేయ్. ఇద్దరం హాయిగా వీడియో చూద్దాం."

"అంత తీరికలేదు సుధా, వీడియో చూడను, కానీ ఇంట్లో కొంచెం పని వుందేయ్, అందుకే సెలవు పెట్టాను."

"ఏమిటా రాచకార్యం?"

"చెప్తాలే, పోనీ నువ్వేరాకూడదూ?"

"మీయింటికా?"

"ఔను సుధా. నీకు కాలక్షేపమూ ఔతుంది. నా పనులూ ఔతాయి. మాయింటికి వచ్చేయ్."

"సరే, వస్తున్నా."

పావుగంట తర్వాత హడావుడిగా వచ్చిన సుధను వీణ నవ్వుతూ ఆహ్వానించింది.

"ఏమిటి మరి అంతగా 'తోచదు తోచదు' అని మమ్మల్నందర్నీ చంపకపోతే ఏదో ఓ ఉద్యోగం చేయ రాదూ?"

"ఎందుకూ? పోటీ వచ్చానని మీ అందరిచేతా తిట్టించు కోవడానికా?"

"పోనీ ఏదైనా హాబీ?"

"అంటే? కుట్లు, అల్లికలూ, వంటా, వార్పూ వగైరా వగైరాలా? చెప్పకు నాకు అవన్నీ"

"పోనీ పూర్వపు రాజులూ, ధనవంతులూ మాదిరిగా ఓ ఆస్థాన విదూషకుడినో, విదూషకురాలినో ఏర్పాటు చేసుకో, నిత్యం నీతో కబుర్లు చెప్తూ వుంటారు."

"హాయ్ వీణా! ఈ సలహా బాగానే వుందే!"

"పోనీ, ఇప్పటికైనా మెచ్చుకున్నావు."

"సలహా చెప్పానని మురిసిపోకు. అటువంటి వాళ్ళని వెదకి పెట్టుమరి."

"చాల్లే. కాఫీచేసి తీసుకొస్తాను. కూర్చో. మతి మాలి మాటలు మాట్లాడుతున్నావు ఎండన పడి వచ్చి."

"ఏమిటలా అంటున్నావు?"

"మరి? నెత్తిమీద తేలు వున్నదంటే, నువ్వే తియ్యి మన్నాడట వెనకటికి ఒకడు, నీకు హాయిగా కబుర్లు చెప్పుకోవడమేగా కావాలి? అటువంటి వాళ్ళు కొల్లలు, మీ యింటి ఇరుగూ పొరుగులనే వెదుక్కో. కాలక్షేపం కబుర్లతో ప్రొద్దు పుచ్చుతూండే సోమరులకేం కొదువ మనకు?"

"ఛ. మరీ నా అభిరుచిని అంత హీనంగా అంచనా వెయ్యకు. ఊం. కాఫీ బాగుందే. కోపంలో ఏవేడి నీళ్ళో మొఖాన పోయలేదు నయం."

"కోపం కాదు సుధా. ఎన్నో యోగ్యతలూ, అర్హతలూ వుండి కూడా నీ వంటి వాళ్ళు ఇలా టైము వృధా చేస్తారెందుకనీ? నిజంగా నాకు చాలా బాధగా వుంటుంది. అలా కబుర్లూ కాకరకాయలతో వృధా చేసే కాలాన్ని ఏదైనా మంచి పనికీ, సేవకూ ఉపయోగించితే....."

"నీతి పాఠాలు వద్దు."

"సారీ."

"అదీ వద్దు. నీ అభిప్రాయం నువ్వు చెప్పావు. కానీ అది కేవలం నీ అపోహ మాత్రమే. మీరు మీమీ ఉద్యోగాల ద్వారా ఏదో గొప్ప దేశసేవ చేసేస్తున్నా మను కుంటే మాత్రం నాకు నవ్వు వస్తుంది."

"ఎందుకో?"

"నువ్వూ, ఇంకా మన యితర స్నేహితులూ అంద రూకూడా బీదవాళ్ళేం కాదు. ఓ మాదిరిగా మంచి జీవితాలు గడుపుతూన్నవాళ్ళే. కుటుంబాల లోని మగవా రు మంచి ఉద్యోగాలు చేస్తూన్నది బ్యాంకి బాలెన్స్‌లు పెంచు కోవటానికీ, ఇంకా ఇంకా ఖరీదైన చీరలూ నగలూ ధరించడానికీ. అంతేగా? అందులో ఏమి దేశసేవ చేస్తున్నావో చెప్పు?"

వెంటనే ఏమీ మాట్లాడ లేక పోయింది వీణ.

"చూశావా మరి వీణా? నేను మరి మీలాగా కాకుండా ఇంట్లో కూర్చోవడం ఒక త్యాగంగానే భావిస్తాను. మనలాంటి వాళ్ళం ఉద్యోగాలకు ఎగబడకపోతే ఆ స్థానాలను నిజంగా కనీస జీవిక కోసం డబ్బు అవస రమైన సామాన్యులు పొందుతారు. అదే మనం చేయ గల గొప్ప దేశసేవ."

"ఖాళీగా కూర్చునే మనిషి మెదడు దెయ్యాల కార్ఖానా అనే మాట వినలేదా?"

"ఖాళీ ఎందుకు?"

"బాగుంది సుధా. ఇవాళ నువ్వునాకు పిచ్చెత్తించ డానికే నా యింటిమీద కొచ్చావా అన్పిస్తోంది. ఏ పనీ చెయ్యవద్దనీ అంటావు; మళ్ళీ ఖాళీగానూ కూర్చో వద్దంటావు."



అదే సమయంలో జడివాన లాగా ప్రవేశించింది వీణ పొరుగింటిలో వుంటూన్న రత్న.

"చూశావా వీణా ఎంత అందంగా వున్నాయో మన వీధి పరిస్థితులు?"

అని వగర్చుతూ ఎవరిపైననో ఫిర్యాదులతో వచ్చింది రత్న.

"కూర్చో రత్నా, ఏమిటీ గొడవ?"

ఆరాగా అడిగింది వీణ.

"వీరెవరూ?"

సుధవైపు సందేహంగా చూస్తూ ఆరా తీసింది రత్న.

"సుధ అని చెప్తూంటాను నా ఫ్రండ్. ఆవిడే."

"ఓ. నమస్కారం సుధగారూ. మా వీధిలో గొడవలు మీకు నవ్వు తెప్పించుతాయేమో?"

'లే'దన్నట్లు నవ్వుతూ తల త్రిప్పింది సుధ.

వీణ బిగ్గరగా అన్నది.

"అలాటి సందేహం అక్కర్లేదు రత్నా. సుధకు కావ



లసినవే కబుర్లూ విశేషాలూనూ. విన్పించు నీ పురాణం నిస్సందేహంగా."

రత్న ఒక సోఫాలో సుఖాశీనురాలై, వీణ యిచ్చిన కాఫీని సిప్ చేస్తూ తన కధనం ప్రారంభించింది.

"ఏం చెప్ప మంటావు వీణా. మా ఎదుటి బంగళా లోనికి ఆ మధ్య క్రొత్తగా దిగబడ్డారే ఒక కుటుంబం తెలుసుగా?"

"ఓ! అహల్య అంటారు ఆవిడేనా?"

"ఆఁ, అక్షరాలా ఆవిడే. నాకు ఆవిడ వ్యవహారం భలే తలనొప్పిగా పరిణమించింది సుమా!"

"ఏం? ఎందుకనీ?"

"ఇప్పటికి ఆవిడ వచ్చి యించుమించుగా సంవత్సరం అయ్యిందా? ఒక్కనాడు కూడా మా యింటికి రాలేదు. నాలుగైదుసార్లు నేను వెళ్ళడమే గానీ."

"ఔను. మా యింటికీ రాలేదావిడ రత్నా. నేనూ రెండు మూడుసార్లు వెళ్లాను. ఎక్కడికీ వెళ్ళదుట."

"ఔనా వీణా. అంతేకాదు. వెళ్ళినప్పుడల్లా నాకు విసుగ్గానే వుంటుందనుకో. ఏదైనా తెలిసిన వాళ్ళ విషయం మాట్లాడబోయా మనుకో. 'ఎందుకండీ ఒకరి విషయాలు మనకీ? మన సంగతులేవో మనం మాట్లాడు కుందాం' అంటుంది గొప్పగా."

"నిజం రత్నా. అలాగే అంటుంది. నలుగురి విషయాలూ చెప్పుకోకుండా ఎలా? నాకూ ఆవిడ స్వభావం చికాకుగానే వుంటుంది."

ఆశ్చర్యంగా వింటూన్న సుధ మధ్యలో కల్పించుకొని అడిగింది.

"వీణా. ఆవిడ స్వభావం ఆవిడదైతే నీకెందుకు కినుక మధ్యన? ఇతరుల విషయాలు చర్చించక పోవడం సంస్కార లక్షణం."

"చాల్లే. బడాయి అదంతా. నీకు తెలియదులే సుధా. ఇక్కడ ఆవిడని రోజూ చూచే వాళ్ళం మాకు తెలుసా నీకు తెలుసా?"

"ఓహో!"

అన్నది సుధ మరి తర్కించలేక. ఆ తర్వాత పావు గంట కాలం విరామం విసుగూ లేకుండా వీణా రత్నా ఆ అహల్య గురించి చెప్పుకొంటూన్న అనేక విమర్శలకు మౌన శ్రోతగా వుండి పోయింది సుధ.

"ఇంతకూ ఆ అహల్యగారూ మీరూ ఒకే ఆఫీసులో వర్క్ చేస్తున్నారా?"

అని సుధ మధ్యలో అడిగినదానికి వీణా, రత్నా కూడా విరగబడి నవ్వారు.

"అదేం లేదు. ఉద్యోగం లేదు, సద్యోగం లేదు. డిగ్రీ వుందట కానీ మనిషిని చూస్తే అలాగ అన్పించదు. 'నవీనత' అంటేనే తెలియని పాత రకం."

"అంటే?"

"మనిషి అతి మామూలుగా వుంటుంది. కబుర్లూ, గీరా చూస్తే మాత్రం పట్టపగ్గాలు వుండవు."

"ఆవిడ తన యింట్లో తను వున్న దానికే మీరింత విమర్శించడం బావులేదు వీణా."

అన్నది సుధ ధైర్యం చేసి.

"ఔనౌను. ఇంచుమించు నువ్వూ ఆ బాపతేగా మరి?"

అని ఎగతాళి చేసింది వీణ.

రత్న కలుగ జేసుకుంది.

"ఆవిడ మాటలు భరించరానివిగా వుంటాయి తెలుసా సుధగారూ?"

"ఉదాహరణకి చెప్పండి?"

"ఈ రోజు విషయమే తీసుకోండి. మా పనిమనిషి కసవు అంతా తుడిచి వీధిలో పారవేసింది. ఇది ప్రతి యింటా జరిగేదే కదా? కానీ ఆ అహల్య ఏం చేసిందో తెలుసా?"

"ఏం చేసిందో?"

"అలా వీధుల్లో పారవేయడం చాలా తప్పు. 'మాయింటి మీదికి ఎగిరి వస్తున్నాయి. ఆ చెత్తాచెదారం అంతా' అని కబురంపింది. అంతతో ఆగిందా? ఫోన్ చేసి పదినిముషాల పాటు నా మెదడును తిని వేసింది."

"ఎలాగా?"

"శుభ్రత గురించి మన ఆడవాళ్ళమే శ్రద్ధ తీసుకో వాలి కానీ మున్సిపాలిటీ వాళ్ళు మాత్రం ఎంతకని చేస్తారు? చెత్త కుండీలలో పోయాలి. లేదా పెద్దపెద్ద ఆవరణలు వున్నవాళ్ళు అసలు తుక్కు, చెత్తా బయట పోయకుండా ఏదో ఓ మూలన గొయ్యి త్రవ్వి తీసి పాతి పడవేసినా, లేదా మంటపెట్టినా అది దొడ్లో చెట్లకు ఎరువూ ఔతుంది, ఇతరులకు యిబ్బందీ చికాకూ వుండదు.' అంటూ ఎన్నెన్ని చెప్పిందనుకున్నారూ?"

సుధ సాలోచనగా వినసాగింది.

వీణ మాత్రం కోపంగా అడిగింది.

"అయితే రత్నా, ఆ గీతోపదేశమంతా నోరు మూసుకు విన్నావా నువ్వు?"

"విన్నా సరిపోను కదా. 'పనిమనుషులు వాళ్ళ యిష్టంవచ్చినట్లు చేస్తారండీ. నేను వాళ్ళకి చెప్పలేను. వాళ్ళు వినరు! అని అన్నాను పొరపాటున. అంతే. మరో పాఠం బోధించింది ఆవిడగారు."

అంటూ నుదురు కొట్టుకుంటూన్న రత్నను వినోదంగా చూస్తూ విరగబడి నవ్వసాగింది వీణ.

రత్న తన కధనాన్ని పొడిగించింది.

"ఆవిడ—ఆ అహల్యగారు నా మీద ముందు బోలెడంత జాలి పడిపోయారు."

"ఎందుకటా?"

"ఎందుకా? 'అయ్యోపాపం. మీరు పని మనుషుల మీద ఎందుకండీ ఆధార పడతారు? ఈ నవీన కాలంలో ఇన్ని రకాల ఆధునిక సదుపాయాలు వచ్చింది మనను పరాధారం నుండి విముక్తులను చేయడానికే కదా' అంటూ లెక్చరిచ్చిందే తల్లీ లెక్చర్!"

ఈసారి వీణ నవ్వలేదు. ఆమె గాంభీర్యంలో కించిత్ క్రోధం కూడా ద్యోతక మౌతూన్నది.

"మాట్లాడవేం వీణా?"

"ఇంచుమించు యిటువంటి హితబోధలే నాకూ చేసింది."

ఈసారి రత్న విపరీతంగా నవ్వింది.

"నిన్న సాయంత్రం ఆవిడ డాబా మీద తిరుగాడు తూన్న సమయంలో దారిన నలుగురు అమ్మాయిలు వెళ్తున్నారు. ఆ అమ్మాయిల్ని ఇద్దరు అబ్బాయిలు వెంటబడి ఒకటే కామెంట్స్ చేస్తున్నారు......"

"ఓ! ఈవ్ టీజింగా? అవి మామూలు దృశ్యాలైపో యాయి ఈ రోజుల్లో."

"అదేమరి. మామూలే అనుకొని మాట్లాడక వూరు కుంటాం మనం. నిజానికి అదంతా నిన్న నేనూ చూస్తూనే వున్నాను. అప్పుడే ఆఫీసునుంచి వచ్చి కూరలు కొంటూన్న సమయంలో జరిగింది."

"ఆఁ. నేనూ మా కిటికిలోంచి అంతా చూస్తున్నానులే వీణా. ఇంతకూ ఆ అబ్బాయిల్లో ఒకడు మీ తమ్ముడేగా?"

అని గొంతు తగ్గించి, కళ్ళు చికిలించుతూ రత్న అడుగుతూంటే వీణ ఖంగారుగా చూచింది సుధవైపు.

సుధ విననట్లే నటించింది పత్రిక తిరగవేస్తూ.

వీణ గొంతు సర్దుకొని, మెల్లని స్వరాన అతి రహస్యంగా చెప్పసాగింది రత్నకు.

"మా తమ్ముడే కావచ్చు. మీ ఆయనే కావచ్చు. మన వాళ్ళకి అదో సరదా. ఊరికే అనుకుంటాం కానీ, నిజానికి ఆడపిల్లలకూ అదంతా సరదాగానే వుంటుంది. ఆమాత్రం కామెంట్సూ, వెంటపడి కాస్త నవ్వులూ, అల్లర్లూ లేనిదే అసలు యింక ఆ యౌవనపు సరదా ఏముంటుందీ?"

"నిజమేలే మరి."

తగ్గు స్వరంలోనే వంత పాడింది రత్న.

"ఆ మహాతల్లి అహల్యకు మరి ఈ మాత్రం యింగి తం కూడా లేదంటే ఏ మనుకోవాలీ? పేద్ద తానే ఊరికి మహారాణి అయినట్టుగా ఆ కుర్రాళ్ళిద్దర్నీ ఎలా దులి పేసిందో చూచావా రత్నా?"

"కుర్రాళ్ళెవరు? మీ తమ్ముడొకడూ, మీ ఆడబిడ్డ కొడుకు ఒకడూ కదూ?"

"అదేలే."

అని నుదురు కొట్టుకుంటూ ఓ దొంగచూపు సుధవైపు విసరి, ఆమె తమ ధోరణిని పట్టించుకోకుండా పుస్తకం చదువుకొంటూన్నదని అనుకొని మళ్లీ చెప్పుకోసాగింది వీణ తన గోడును.

"ఈ మగాళ్ళిద్దర్నీ తిట్టి, నీతిపాఠాలు చెప్పింది. ఏదో సరదాగా ఆడపిల్లలని ఆటలు పట్టించారు కానీ వాళ్ళేం మహా నేరం చేశారనీ? 'మీ ప్రవర్తనకి మీరు సిగ్గు పడడమే కాదు, మీ కన్నవాళ్ళు తలలు వంచు కోవాలి మీకు యిటువంటి కుసంస్కారం నేర్పినందుకు. దారిన వెళ్తూన్నప్పుడు నీ చెల్లిలినో అమ్మనో ఎవడైనా ఇలా మాటలు అంటే నువ్వు విచారిస్తావా, సంతోషిస్తావా?' అని కూడా అడిగింది రత్నా. మా వెధవలు నోళ్ళు మూసుకు వచ్చారు ఎదురు మాట్లాడకుండా."

"ఏం మాట్లాడతారు వీణా నడిరోడ్డున పెట్టి నలుగురూ వినేటట్టు దులిపేస్తే? అంతేకాదు, ఆ ఆడపిల్లలని కూడా తిట్టింది. 'ఎవళ్ళేమన్నా తల ఒంచుకొని మిమ్మల్ని కానట్టు చతుష్పాద జంతువులలా నడుస్తారెందుకు? ఎదిరించి వాళ్ళ నోళ్ళు మూయించలేని మీ చదువులూ షోకులూ ఎందుకు? ధైర్యం నేర్చుకోండి' అన్నది వాళ్ళ ని!"

"అంటుంది అంటుంది."

అని కక్షగా పళ్ళు నూరుకొంది వీణ.

"చూస్తాండు. అవకాశం చూచి యింతకింతా ఆ అహల్యను నేను బాధపెట్టాలి. నా కసితీరాలి."

"ఎలా?" రత్న ఉత్సాహం చూపింది.

"ఎలాగేమిటి? దాని కూతురు మాచెల్లెలి స్టూడెంట్. మా చెల్లెలు సరస్వతి తెలుసుగా? కాలేజి లెక్చరర్?"

"అయితే?"

"ఏవో ఒక కారణాలతో దాన్ని బాధ పెట్టించితే సరి."

"ఎలా సాధ్యమౌతుంది? ఆపిల్ల చాలా బ్రిలియంట్ స్టూడెంట్ అని అందరికీ తెలుసుగా?"

"ఏడిసింది. తలచుకోవాలే గానీ అనేక దారులు దొరుకుతాయి. చూస్తాండు. మా వాళ్ళని రోడ్డుమీద నలుగురూ చూచేట్లు చిన్నబుచ్చిందిగా? దాని కూతుర్ని అందరూ చూస్తూండగా పబ్లిక్ పరీక్ష హాలులో అల్లరి పెట్టించాలి."

"ఏముందీ? ఎవరినో ఏదో అడిగిందనో, కాపీ చేసింద నో, లేక ఏమైనా స్లిప్స్ తెచ్చి వాచర్‌ని చూసి విసిరే సిందనో కథ కల్పించడమే. ఆ పిల్లకి ఇక పరీక్షరాసే మూడే వుండదు. పరీక్ష తన్నేస్తుంది. 'ప్రతి ఏడూ మా అమ్మాయి ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతుంది' అని చెప్పుకొని విఱ్ఱవీగే ఆ తల్లి గర్వం అణగుతుంది. నా కక్ష తీరు తుంది."

"భలే వీణా భలే పథకంవేశావ్. అలా చేశావంటే ఆ అహల్య చెప్పే నీతుల వల్ల బాధితుల మౌతూన్న మనమూ, మనలాంటి వాళ్ళందరూ సంతోషిస్తారు."

అని చప్పట్లు చరుస్తూ తన ఆనందాన్ని వ్యక్తపర చింది. రత్న

"బాప్‌రే!"

అని అతి ఆశ్చర్యంతో అంటూన్న సుధను చూచి రత్నా, వీణా ఉలికిపడ్డారు. అంతవరకూ తమ ఆవేశధోరణిలో వున్న వాళ్ళు సుధ ఉనికినే విస్మరించి వున్నారు.

"వీణా! నీ అసలు రంగూ, స్వభావం ఇవన్నమాట? ఒక ఉద్యోగం, వ్యాపకంలేని నన్ను చూచి జాలి ప్రక టించావు నువ్వు కొద్ది సేపటి క్రితం. దేశసేవా, ప్రగతీ వగైరా పెద్దపెద్ద పదాలు ఉపయోగించావు. కానీ వాటి అర్థమైనా తెలియని నిన్ను చూచి నేను జాలిపడాలా, ఏవగించు కోవాలా? నలుగురికీ మంచి చెప్పే ఆవిడపై నీకు యింత కక్షదేనికీ?"

"ఏమిటి అంత కోపంగా వున్నావు? ఆ అహల్య నీకు స్నేహితురాలా? బంధువా?"

రోషంగా అడిగింది వీణ సుధను.

జాలి కురుస్తూన్న చిరుహాసం వెలిసింది సుధ పెద వులపై.

"ఇది వరకు కాకున్నా ఇపుడు స్నేహం చేసుకుంటాను వీణా. మీ మాటలనుబట్టి చూస్తే ఆ అహల్యాగారిది ఒక అపురూప వ్యక్తిత్వం అని నాకు గ్రాహ్యమైంది."

"ఓ! అయితే మేమంతా పనికిరాని వాళ్ళమేనా సుధా? నా శత్రువుతో నువ్వు స్నేహం చేస్తావా?"

"వీణా! శత్రువు అని అనడానికి నోరెలా వస్తోంది? అందరికీ మంచి చేసేవారూ, హితవు పలికే వారూ శత్రువులు కారు. అసలు వాళ్ళని ప్రత్యేకం ఒక వ్యక్తిగా చూడకూడదు."

"మరి? దేవుళ్ళా?"

"ఆఁ. ఒక విశ్వవిద్యాలయంలో ఒక సంవత్సర కాలం అభ్యసించిన విద్యకంటె అటువంటి వ్యక్తులతో కొన్ని గంటల కాలం గడపితే కలిగే జ్ఞానమూ, బుద్ధి వికాశ మూ అపారం. అయినా ఇవన్నీ మీ వంటి వాళ్ళకు అర్థం కావు. 'కబుర్లతో కాలక్షేపం చేయం. ఉద్యోగినులం. ఖాళీగా కూర్చోము' అంటూ ప్రగల్భాలు పలికిన నువ్వు ఇంతవరకూ చేసినదేమిటో ఆలోచించుకో వీణా. స్వభా వంలోనూ, నడవడిలోనూ నవీనత వేషభాషలలో వుంటే చాలా?"

కోపంగా వున్న వీణలో ఎటువంటి పరివర్తనా కలు గలేదు. అయిష్టంగా ముఖం మరో ప్రక్కకు త్రిప్పుకొంది. ఆమె గుంభనంగా చిరునవ్వుతో రత్నకు ఏదోసైగ చేయడం, రత్న కన్ను చికిలించి చౌకబారుగా నవ్వడం గమనించిన సుధ మరి తర్కించలేదు.

"థాంక్స్ వీణా. ఈ రోజు నీ దయవల్ల నాకు సత్కాలక్షేపానికి ఒక మంచి మిత్రురాలు దొరక బోతూన్నది. నిన్ను అడిగినా నాతో వచ్చి అహల్యగారికి నన్ను పరిచ యం చేయవని తెలుసు. నేనేవెళ్ళి పరిచయం చేసు కుంటాను. బై."



## నర్తకి వాణీ సుజాత

కుమారి అనంతుల వాణీ సుజాత ఇటీవల 'త్రివేణీ' (అమలాపురం) సంగీత, నృత్య, సాహిత్య వేదిక వారి వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటైన నృత్య కార్యక్రమంలో 'సుందరి' గా చక్కని అభిన యాన్ని చూపి, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 'సౌందరనందం' నృత్యనాటికలో సుందరి పాత్రధారిగా ఈమె నటించారు. నాగార్జున నృత్య కళానికేతన్ (గుంటూరు) లో శ్రీమహంకాళి సూర్య నారాయణ శర్మగారి వద్ద ఈమె నృత్యం అభ్యసిస్తున్నారు.

పదవ ఏటనుండీ నృత్యం అభ్యసిస్తున్న కుమారి సుజాత కూచిపూడి డిప్లొమా పరీక్షలో, భరతనాట్యం సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణురాలైంది. భరతనాట్యం డిప్లొమా పరీక్షకు అభ్యాసం చేస్తోంది.

బి.ఏ. తృతీయ సంవత్సరం, గుంటూరు హిందూ కళాశాలలో చదువుతున్న ఈమె, దక్షిణ భారత హిందీ ప్రచారసభవారి 'ప్రవీణ' పరీక్షలో కూడా ఉత్తీర్ణురాలైంది.

ఆంధ్రప్రదేశ్ అంతటా వందకు పైగా నృత్య ప్రదర్శనలు యిచ్చిన వాణీసుజాత ఇంటర్ యూని వర్శిటీ నృత్య పోటీలకు కాన్పూరులోను, ఢిల్లీలో రాష్ట్రపతి శ్రీ ఆర్.వెంకటరామన్‌గారి సన్నిధిలోనూ ప్రదర్శనలు ఇచ్చింది. ఐ.సి.సి.ఆర్ ద్వారా భూటాన్‌లోను, దూరదర్శన్‌లోను నృత్యప్రదర్శన లిచ్చింది.

— వి. జానకీదేవి.